కనిపిస్తే కబ్జానే !


నెలబల్లి పరిధిలోని ప్రభుత్వ భూమిని సాగుకు సిద్ధం చేసుకున్న కబ్జాదారులు

జాతీయ రహదారి వెంబడి రూ.లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా.. రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే గాక ఏకంగా అందులో పంట సాగు చేసేందుకు ఆక్రమణదారులు సిద్ధమయ్యారంటే రెవెన్యూ అధికారుల పనితీరు ఎలా ఉందో ఇట్టే తెలిసిపోతోంది. దొరవారిసత్రం మండలంలోని నెలబల్లి రెవెన్యూ పరిధిలో రూ.లక్షలు విలువజేసే ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించడంతో పాటు ఏకంగా చదును చేసి పెట్టుకున్నారు. అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినా ఖాతరు చేయని కబ్జాదారులు పంటసాగుకు సిద్ధం కావడం గమనార్హం.

- దొరవారిసత్రంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్ను
- నెలబల్లి గ్రామ ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు
- అదే భూమిని కాజేసేందుకు ఆక్రమణదారుల పన్నాగం
- రూ.లక్షలు విలువజేసే భూమిని సాగుకు సిద్ధం చేసుకున్న ఆక్రమణదారులు

దొరవారిసత్రం : మండలంలో ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించినా.. అది ఎన్ని రూ.కోట్లు విలువజేసేది అయినా సరే ఆక్రమించేస్తారు. ఖాళీగా కనిపిస్తే ఆక్రమణదారులు గుట్టుచప్పుడు కాకుండా కబ్జా చేసేస్తున్నారు. ఎవరూ పట్టించుకోకపోతే ఒక భూమి వారిదే అని ఫీల్ అయిపోయి పాగా వేస్తారు. సదరు భూమిలో గుట్టలు, నట్లు ఉంటే వారే జేసీబీలతో చదును చేయించేస్తారు. ఇంతటితో ఆగని భూకబ్జాదారులు ఆక్రమిత భూముల్లో సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డులు పెడుతున్నారే తప్ప ఈ ఆక్రమణలను పూర్తిస్థాయిలో అరికట్టలేని పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులు ఉన్నారు. వివరాలు.. దొరవారిసత్రం మండలం నెలబల్లి రెవెన్యూ పరిధిలోని రహదారి వెంబడే సర్వే నంబరు 27, 28, 29, 30 తదితర సర్వే నంబర్లలో సుమారు 35 ఎకరాల వరకు విస్తరించి పట్టా భూములు ఉన్నాయి. ఇదే నంబర్లలో అక్కడక్కడ ప్రభుత్వ భూమి సుమారు 3 ఎకరాల వరకు ఉంది. పట్టా భూములను అడ్డు పెట్టుకుని ప్రభుత్వ భూములను కూడా గుట్టుచప్పుడు కాకుండా తీర్చేశారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి ఈ ప్రాంతంలో ఎకరా రూ.50 లక్షల పైబడే పలుకుతుంది. ఈ విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు సైతం ఏమీ పట్టించుకోకుండా ఉండడంపై విమర్శలకు తావిస్తోంది.

హెచ్చరిక బోర్డులు పెట్టినా..?


నెలబల్లి సర్వే నంబరు 7 ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఫైల్)

నెలబల్లి రెవెన్యూ పరిధిలో రహదారికి ఆనుకుని ఉన్న సర్వే నంబరు 7లో ఉన్న ప్రభుత్వ భూమి 2 ఎకరాలకు పైబడి ఆక్రమణకు గురైంది. దీన్ని గుర్తించి స్థానిక రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా ఒకటికి రెండు దఫాలు ఇదే భూమిని ఆక్రమణదారులు కబ్జా చేసి సాగుకు దిగారు. ఇటీవల రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ అవసరాలకు ఈ భూములు అవసరం(పీఓటీ) అంటూ హెచ్చరిక బోర్డులను మూడు ప్రాంతాల్లో పెట్టారు. కానీ ఈ భూములను మళ్లీ యథావిధిగా ఆక్రమించేందుకు కబ్జాదారులు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

5న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న ఏడో అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్

గూడూరురూరల్ : జూలై 5న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏడో అదనపు జిల్లా జడ్జి కె.వెంకటనాగపవన్ కోరారు. గూడూరులోని కోర్టు సముదాయంలో మంగళవారం ఆయన జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి పోలీసులు, న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని, కక్షిదారులు పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఆ దిశగా పోలీసులు చొరవ చూపాలని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి బీవీ సులోచన రాణి, పి.శంకరయ్య, బార్ అసోసియేషన్ సెక్రటరీ ఎంవీ కృష్ణయ్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎ.కోటేశ్వరరావు, ప్యానల్ అడ్వకేట్ మహబూబ్‌బాషా, లోక్‌అదాలత్ సభ్యులు జానా సురేష్, సీనియర్ న్యాయవాదులు రజనీకాంత్‌రెడ్డి, పట్టణ సీఐ శేఖర్‌బాబు, గూడూరు రూరల్, చిల్లకూరు, మనుబోలు, సైదాపురం ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బారికేడ్ల వితరణ


పెంచలకోన స్టేషన్‌కు బారికేడ్లు అందిస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన పోలీస్‌స్టేషన్‌కు భారతి సిమెంట్ ప్రతినిధులు వారు మంగళవారం 6 బారికేడ్లను వితరణగా అందించారు. పెంచలకోన పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ఈ బారికేడ్లు ఉపయోగపడేలా వాటిని అందించినట్లు భారతి సిమెంట్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో శివాని ఫర్టిలైజర్స్, భారతి సిమెంట్ డీలర్ ఏటూరు పరంధామ రెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ బాబుజాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

చిట్టమూరు : మండలంలోని మల్లాం గ్రామంలో స్వయంభుగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పాలాభిషేకం, పంచామృభిషేకాన్ని పురోహితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేపట్టి కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. కుజదోషం ఉన్న భక్తులు హోమం చేసుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నాయుడుపేట మండలం తుమ్మూరుకు చెందిన పల్లేటి తిష్య చరిత, గీత, గోపికృష్ణ అన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఆర్‌ఓ ప్లాంట్ విరాళం

కోట: మండలంలోని జరుగుమల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుంపల పద్మావతి మంగళవారం మండల విద్యాశాఖ కార్యాలయానికి రూ.10వేలు విలువజేసే వాటర్ ప్యూరిఫైర్‌ను బహూకరించారు. ఈ నెలాఖరులో పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా కార్యాలయానికి ఆర్‌ఓ ప్లాంట్‌ను అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శైలజ హెచ్‌ఎం పద్మావతిని అభినందించారు.

ఆటో బోల్తా


రాపూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుశీల

రాపూరు: రాపూరు సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద మంగళవారం ఆటో బోల్తా పడడంతో మహిళ గాయపడిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఆత్మకూరుకు చెందిన సుశీల తిరుపతి నుంచి స్వగ్రామానికి ఆటోలో వస్తుండగా కళాశాల వద్ద కుక్క అడ్డు రావడంతో ఆటో డ్రైవర్ దాన్ని తప్పించే యత్నంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుశీల కాలు విరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది రాపూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం గూడూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఛిద్రమవుతున్న రోడ్లు


రోడ్డుపై పడి ఉన్న తెల్లరాయి ఖనిజం

సైదాపురం: మండలం నుంచి ఇతర ప్రాంతాలకు ఖనిజ సంపదను తరలించే వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారు. దీంతో గ్రామాల పరిధిలోని రోడ్లు గుంతలు పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. డ్రైవర్లు ఇష్టానుసారం నడపుతుండడంతో లారీలు, టిప్పర్లలో తరలించే ఖనిజం రోడ్ల మీద పడుతోంది. దీంతో ఆ దుమ్ము ధూళికి వెనుకాల వచ్చే వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కండలేరులో 34.688 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 34.688 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2500, పిన్నేరుకాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటిబ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

మాజీ సీఎం జగన్‌తో భేటీ


మాజీ సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గిరిధర్ రెడ్డి

నాయుడుపేటటౌన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని కార్యాలయంలో జగన్ మోహన్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. రెండు పర్యాయాలు తనను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియామకం చేసిన మాజీ సీఎం జగనన్నకు పార్టీకు ఎల్లవేళలా రుణపడి ఉంటామన్నారు.

యువతపోరు విజయవంతం


పాలేటి నాగార్జున

నాయుడుపేట టౌన్ : నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు తదితర హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం తీరును ఎండగడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన యువతపోరు కార్యక్రమం విజయవంతం అయిందని నియోజకవర్గ పార్టీ యువజన విభాగ కన్వీనర్ పాలేటి నాగార్జున తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజలతో కలిసి పోరాటాలు చేసేందుకు పార్టీ నాయకులు ఎప్పుడూ ముందుంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నుంచి నాయకులు, యువజన విభాగాల నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్తంభాలగిరిలో వైఎస్సార్‌సీపీ నేతల పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం తిరుమలపాడు గ్రామంలో వెలసిన శ్రీ స్తంభాలగిరి శివపార్వతులను జెడ్పీటీసీ సభ్యులు అనీల్‌కుమార్ రెడ్డి, తిరుపలపాడు, పర్లకొండ సర్పంచ్‌లు కృష్ణ, కేశవులు, మాజీ సర్పంచ్ రతయ్య మంగళవారం దర్శించుకున్నారు. శివపార్వతులు గ్రామోత్సవంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నేతలు తొలుత స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా హోమం


హోమం నిర్వహిస్తున్న విజయదుర్గా పీఠం నిర్వాహకులు కోట సునీల్‌స్వామి

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని పటేల్ వీధిలో వెలసిన విజయదుర్గ ఉప పీఠంలో మంగళవారం వాల్మీకి రామాయణంలోని సుందరకాండ పారాయణ సహిత మహాహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప పీఠం నిర్వాహకులు కోట సునీల్‌కుమార్ స్వామి మాట్లాడుతూ అమావాస్య తిథిని పురస్కరించుకుని శ్రీ శనైశ్వర భగవానుని సంపూర్ణ అనుగ్రహం కోసం మహా హోమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇలాంటి హోమాలు చేయడం వల్ల సకల శుభాలు జరగడంతో పాటు ప్రతి కుటుంబంలో శాంతి సౌభాగ్యాలు నెలకొంటుందన్నారు. అలాగే సాయంత్రం అమ్మవారి నక్షత్ర నవగ్రహక పూర్వక నవావరణ హోమం నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు హోమాల్లో పాల్గొన్నారు.

రైతులకు అవగాహన


సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గూడూరురూరల్ : వ్యవసాయంలో టెక్నాలజీతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ ఏడీ గోపీనాయక్ తెలిపారు. మండలంలోని పాలిచెర్ల, పాలిచెర్ల రాజుపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు, మారుతున్న టెక్నాలజీని రైతులకు చేరవేసే విస్తరణ కార్యక్రమమే పొలం పిలుస్తోంది అని అన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి వి.రమేష్ మాట్లాడుతూ పచ్చిరొట్ట, పీఎండీఎస్ కిట్లను సబ్సిడీపై త్వరలో రైతులకు అందజేస్తామని తెలిపారు. ఇవి భూసారం పెంపుదలకు ఎంతగానో ఉపయోగపడతాయని, నేలను కాపాడుతాయన్నారు. అనంతరం నిమ్మ తోటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలను వివరించారు. ఉద్యానశాఖ అధికారి ఎస్.సునీత, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ఆకలివలస సమీపంలో వెలసిన బుగ్గేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకం, హోమం, పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం శివపార్వతుల విగ్రహాలను కొలువుదీర్చి వివిధరకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. తదుపరి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శివపార్వతుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ


ఏఐటీయూసీ జెండాను ఎగురవేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

గూడూరురూరల్ : గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా కార్యదర్శి పుట్టా మహేంద్ర డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద ఉన్న ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మహేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ జీఓ ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి పీఎఫ్, ఈఎస్‌ఐలను ఇవ్వాలని, ప్రతినెలా క్రమం తప్పకుండా గుత్తేదారుడు జీతాలు చెల్లించాలన్నారు. త్వరలో కొత్తగా నియమితులయ్యే గుత్తేదారుడు ప్రభుత్వ జీఓ ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా కార్మికులకు జీతాలు చెల్లించేలా ఆస్పత్రి సూపరింటెండెంట్ చొరవ తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నేతలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడట్లకు శిక్షణ


శిబిరంలో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ కేడెట్లు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో జరుగుతున్న ఎన్‌సీసీ 10ఏ నావల్ యూనిట్ శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతుంది. మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్లు 8 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేస్తూ గూడలికొండ వరకు ట్రెక్కింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా గూడలికొండపై వెలసిన భీమేశ్వరస్వామి సన్నిధిలో ఆహ్లాదకరమైన ప్రకృతిని ఆస్వాదించి, స్థల విశిష్టతను తెలుసుకున్నారు. మధ్యాహ్నం అగ్నిమాపకశాఖ అధికారులు అగ్నిప్రమాదాలపై ఎన్‌సీసీ కేడెట్లకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు బాధితులను ఏ విధంగా రక్షించాలి ? సురక్షిత ప్రాంతానికి తరలించడంపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ గణేష్ గొడంగవే, ఏఎన్‌ఓ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన


ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలిస్తున్న ఎంపిడిఓ వినీల్

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలంలోని నిండలి గ్రామంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును ఎంపీడీఓ డీజే వినీల్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ పరిశ్రమలో ప్రమాదం

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లిలో ఉన్న ఓ స్టీల్ పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వలస కార్మికులు గాయపడిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానికుల సమాచారం మేరకు స్టీల్ పరిశ్రమ వద్ద లిక్విడ్‌ఐరన్ ఆవిరి తాకిడికి ప్లాంట్‌లో పని చేస్తున్న ఇద్దరు వలస కార్మికులకు గాయాలు కావడంతో పరిశ్రమ యాజమాన్యం హుటాహుటిన చికిత్స నిమిత్తం చెన్నైకి తరలించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయమై సీపీఎం నాయకులు స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై రెవెన్యూ కార్యాలయంలో డీటీ యువరాజ్‌కు ఫిర్యాదు చేశారు.

ప్రమాదాల నివారణపై జాగ్రత్తలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్ : వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు ప్రమాదాల నివారణకు పలు జాగ్రత్తలు వహించాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు. పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణం వద్ద మంగళవారం కారు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగిస్తూ.. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. వాహనాలు నడిపే ప్రతి డ్రైవర్ విధిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణతో చీడపీడల నియంత్రణ


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

దొరవారిసత్రం : మండలంలోని అక్కరపాక, సూరపుఅగ్రహారం గ్రామాల్లో వ్యవసాయ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటను ఆశించే చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన పురుగు మందుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. సూరపుఅగ్రహారం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం కింద పీఎండీఎస్ 20 రకాల పంట సాగు చేస్తున్న పొలాన్ని అధికారులు రైతులతో కలిసి సందర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం పట్టా భూములకే కాకుండా ప్రభుత్వ భూములు ఉన్నవారికి కూడా వర్తిస్తుందని ఏఓ జ్యోతిర్మయి తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

తడ: 16వ మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శేఖర్‌నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆధార్ సేవలు పునరుద్ధరణ


ఆధార్ అప్‌డేట్ చేసుకుంటున్న ప్రజలు


ఆధార్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ డీజే వినీల్

వాకాడు : మండలంలోని నెల్లిపూడి, వాకాడు-2 సచివాలయాల్లో ఎంతోకాలంగా నిలిచిపోయిన ఆధార్ సేవలను పునరుద్ధరించామని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం సచివాలయాలను తనిఖీ చేసి ఆధార్ సేవలను ప్రారంభించారు. దాదాపు 25 మందికిపైగా ఆధార్ సేవలను ఉపయోగించుకున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ మౌనిక, జితేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి రూరల్: మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ సచివాలయంలో మంగళవారం ఆధార్ సేవలు ప్రారంభించినట్లు చెప్పారు. 26న బంగారుపేట సచివాలయం, 27 రాణిపేట సచివాలయంలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

బాలాయపల్లిలో..

బాలాయపల్లి(సైదాపురం) : ఆధార్ సవరణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఆధార్ సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ డీజే వినీల్ తెలిపారు. మండలంలోని నిండలి సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా సచివాలయాల్లో ఆధార్ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజు కొనసాగిన సమ్మె


నిరసన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును విధుల నుంచి వెంటనే బదిలీ చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ నాయకులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట 6వ రోజు నిరసన దీక్ష కొనసాగించారు. కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావుపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య, యూనియన్ అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తీగ తగిలితే అంతే!



చేతికందే ఎత్తులో ఉన్న తీగలు, ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభం

సైదాపురం: నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగించే రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. పొలాలకు వెళ్లే ఈ త్రీఫేజ్ విద్యుత్ లైన్లు కూడా చేతికందే ఎత్తులో ఉండడంతో రైతులకు పొరపాటున ఈ తీగలు తగిలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మండలంలోని ఊటుకూరు, గిద్దలూరు గ్రామాల్లో విద్యుత్ తీగలు చాలాకాలంగా తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. ఊటుకూరు గ్రామంలో ఓ ఇంట్లోనే ఉన్న విద్యుత్ స్తంభం కూడా ఉంది. ఆ స్తంభానికే పలు ప్రాంతాలకు వెళ్లే లైన్లు కూడా ఉండడంతో పాటు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. దీంతో ఏ క్షణం ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకముందే విద్యుత్ తీగలు మరమ్మతులతో పాటు స్తంభాలు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించండి

కలువాయి(సైదాపురం) : పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల చెప్పే మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారి కళారాణి తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని చీపినాపి, తోపుగుంట గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి రామకృష్ణ, వ్యవసాయ సహాయకులు శ్రీనివాసులు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.